క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండ



కుటుంబానికి నగదు అందజేస్తున్న సభ్యులు

కుభీర్: మండల కేంద్రంలోని తోకలలక్ష్మి–లింగన్న దంపతుల కుమారుడు రమేశ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం అందించేందుకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కుభీర్‌కు చెందిన పాండురంగ సేవాసమితి సభ్యులు సేకరించిన విరాళం రూ.లక్షా 30వేలను బాధితుడికి అప్పగించారు.

ఏఈవోల నిరసన

కడెం: రాష్ట్రవ్యాప్తంగా ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కడెంలోని రైతువేదికలో ఏఈవోలు నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో మండల ఏఈవోలు మాట్లాడారు. డిజిటల్ సర్వేపథకంతో రాష్ట్రంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు, ఏఈవోలకు మధ్య చిచ్చు రగులుతుందన్నారు. సర్వే నుంచి మహిళా ఉద్యోగులను మినహాయించాలని.. సిబ్బందిని కేటాయిస్తే సర్వే చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

ఆశవర్కర్ల దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న ఆశవర్కర్లు

మామడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశవర్కర్ల దినోత్సవం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ మాట్లాడారు. ఎయిడ్స్‌తో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఆశవర్కర్లు పాల్గొన్నారు.

దండారీలకు చెక్కులు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో ఉన్న తుమ్మగూడెం, ఇప్పమాడ గ్రామాల్లోని ఆదివాసీలకు ప్రభుత్వం నుంచి మంజూరైన దండారీ ఉత్సవాల చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, రాంచందర్, తదితరులు దండారీలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీలు, తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవో అశోక్‌వర్మ తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతిగదులు, ఆవరణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు ముత్యం, శ్రీనివాస్, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుర్మలు సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

లోకేశ్వరం: జిల్లాలోని కుర్మలు కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు జెడ్ల రాజారాం అన్నారు. మంగళవారం లోకేశ్వరంలోని కురుమ సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. కాలం ఏడులో మన కులాన్ని కురుమ అని, కాలం నంబరు 25లో కులవృత్తి గొర్రెలకాపరి అని రాయించుకోవాలన్నారు. కొందరు అవగాహన లేక గొల్ల కుర్మ, యాదవ అని చెబుతున్నారని పేర్కొన్నారు. వారి వెంట కురుమ సంఘం సభ్యులు ఉన్నారు.

ఎన్‌సీసీకి ఎంపిక

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 62 మంది విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన ఎన్‌సీసీ అధికారులు రమేశ్ హవల్దార్, సునీల్ నాయబ్‌దార్.. విద్యార్థులకు కంటి పరీక్షలు, శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు పార్థసారథి ఎన్‌సీసీ కేర్ టేకర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరిహరనాథ్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, సట్ల గంగాధర్, గంగారాం, శ్రీనివాస్, క్రాంతి, సాయి శ్యాం ఉన్నారు.

నేటి మహాసభలను విజయవంతం చేయండి

ముధోల్: నిర్మల్‌లో ఈనెల 6న జరిగే గౌడ సంఘ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని గౌడ సంఘం మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌లోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నాలుగో మహాసభలను బుధవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తామని.. దీనికి జాతీయ అధ్యక్షుడు, గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, మోకుదెబ్బ జాతీయ సెక్రెటరీ జనరల్ సిద్ది రాములు, తదితరులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

కేంద్రాల్లోనే మద్దతు ధర

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్
- రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు ఆదేశం



ముధోల్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

ముధోల్: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు మద్దతుధర లభిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని ముధోల్, చించాల, వెంకటాపూర్, విఠోలి, బోరిగాం, వడ్తాల, చింతకుంట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. తహసీల్దార్ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్, ముధోల్ పీఏసీఎస్ డైరెక్టర్ సుదర్శన్, లక్ష్మీ నర్సాగౌడ్, సాల్వీ రమేష్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, రోళ్ల రమేశ్, శ్రీనివాస్, సంతోష్, పోతన్న ఉన్నారు.

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి), ధని, వంజర్, మలక్‌చించోలి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ప్రారంభించారు. వంజర్‌లో చైర్మన్‌ను హాదీని రెడ్డి సంఘం గ్రామశాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ శంకర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం మాధురి, ఏఎంసీ డైరెక్టర్లు ముక్త్యార్, నాగరావు, మారుతి, రాంశంకర్‌రెడ్డి, షేక్ షఫీ, లక్ష్మణ్, రౌతు మల్లయ్య, మహిళలు ఉన్నారు.

కడెం: మండలంలోని అంబారిపేట్, నవాబ్‌పేట్, మద్దిపడగ, నచ్చన్‌ఎల్లాపూర్, ఎలగడప గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామడుగు శైలజరమేశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, సీఈవో రాజేందర్, సొసైటీ డైరెక్టర్లు గొళ్ల వెంకటేశ్, మల్లేశ్, రాజం, భూషణం, రెంకల శ్రీనివాస్, సలీం, ఇందూర్‌నేత, రహీం, శంకర్, బొడ్డు గంగన్న, ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



చించోలి(బి)లో కేంద్రం వద్ద అబ్దుల్ హాదీ, నేతలు



కడెం: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ జీవన్‌రావు, ఆర్‌ఐ వేణుగోపాల్, ఏఈఓ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్, నిర్వాహకుడు నడిపొల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, చామన్‌పెల్లిలో నాయకులు కేంద్రం ప్రారంభించారు. అశోక్, ప్రభాకర్, గంగాధర్, మధు, రాజేశ్వర్, సురేశ్, గంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి)లో..

ఇంటింటి సర్వే తప్పుల్లేకుండా నిర్వహించాలి

- డీపీఓ శ్రీనివాస్
- ఎన్యుమరేటర్లకు శిక్షణ

తానూరు: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా తప్పుల్లేకుండా నిర్వహించాలని డీపీఓ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా డీపీవో పాల్గొని మాట్లాడారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ సుదర్శన్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంఈఓ నరేందర్, ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బందికి ఇంటింటి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది సుమారు 75 ప్రశ్నలతో సర్వే చేయాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం సూచించారు. సర్వే అనంతరం ఇంటికి స్టిక్కర్ అంటించాలని సూచించారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులున్నారు.

భైంసారూరల్: ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్వేపై ఎంపీ డీవో సుధాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎంపీవో మోజంహుస్సేన్, ఎంఈవో సుభాశ్ తదితరులున్నారు.

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటింటి సర్వేపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌వో సాయికుమార్ మాట్లాడుతూ మూడు రోజులు ఇంటింటికీ వెళ్లి సర్వే కుటుంబాలను గుర్తించాలని.. లెక్క తేలిన తరువాత 15రోజులు సర్వే చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనుమానాలుంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో నవనీత్ కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఎంఈవో విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



తానూరులో శిక్షణ ఇస్తున్న డీపీఓ శ్రీనివాస్



కుభీర్‌లో మాట్లాడుతున్న ఏఎస్‌వో సాయికుమార్

మామడ: ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి అన్నారు. మామడ మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై శిక్షణ నిర్వహించారు. అనంతరం ఎన్యుమరేటర్లకు స్టేషనరీ సామగ్రి అందించారు. ఎంపీఓ గంగాసాగర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో ఎన్యుమరేటర్లకు ఎంపీఓ తిరుపతిరెడ్డి ఇంటింటి సర్వేపై శిక్షణ నిర్వహించారు. ఎన్యుమరేటర్లు పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఎంఈఓ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: నేటి నుంచి చేపట్టే ఇంటింటి సర్వేపై మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం అధికారులకు ఎంపీడీవో రాధ అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి 150 ఇళ్ల వివరాలను నమోదు చేసేందుకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇందులో తహసీల్దార్ జానకి, ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్వరం: మాట్లాడుతున్న తహసీల్దార్ మోతీరాం

లోకేశ్వరం: తప్పుల్లేకుండా కుటుంబసర్వేను నిర్వహించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఇంటింటి సర్వేపై ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీఈవో సోలమాన్‌రాజ్, ఏఎస్‌వో సౌమ్య, ఆర్‌ఐ బాలకిషన్, లలిత, ట్రెయినీ మురళీధర్ ఉన్నారు.

కుంటాల: సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఎంఈవో ముత్యం, ఎంపీవో రహీంఖాన్ పాల్గొన్నారు.

రోడ్డుపై సంతతో ప్రజలకు కష్టాలు



రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

- ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో రాకపోకలకు ఇబ్బంది
- స్థల సమస్య పరిష్కరించాలని కోరుతున్న మండల వాసులు

తానూరు: మండల కేంద్రంలో కొన్నేళ్ల కిందట వ్యాపారం చేసేందుకు కొందరు షెడ్లను నిర్మించుకున్నారు. ఏటా గ్రామపంచాయతీకి పన్నులు చెల్లించి తమ చిరువ్యాపారాలను కొనసాగిస్తున్నారు. కొంతమంది తమ పేరిట ఉన్న దుకాణాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చి రూ.లక్షలు తీసుకుంటున్నారు. ఇతర గ్రామాలకు చెందినవారికి షాపులు అద్దెకు ఇవ్వడంతో తమకు అన్యాయం జరుగుతోందని సోమవారం పలువురు స్థానిక యువకులు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వారసంత స్థలం(ప్రభుత్వ భూమి)లో షెడ్లు నిర్మించుకునేందుకు కర్రలు ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు, యువకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. షెడ్లు ఏర్పాటు చేసి ఇతరులకు అద్దెకు ఇస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకున్న తర్వాతనే సంత స్థలంలో మేం ఏర్పాటు చేసుకున్న కర్రలు తొలగించాలని సదరు యువకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంత అయినప్పటికీ సంత స్థలంలో కాకుండా వ్యాపారులు ధర్మాబాద్, జౌలా(బి), కోలూరు రోడ్లపై వ్యాపారం సాగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



సంత స్థలంలో అక్రమంగా షెడ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన కర్రలు

ప్రొక్లెయిన్, ట్రాక్టర్లు పట్టివేత

ఖానాపూర్: పట్టణ శివారులోని వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రొక్లెయినర్, రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని మంగళవారం ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి ఇసుక తరలిస్తున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చామన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం దందాలు చేస్తే ఎంతటివారినైనా వదలబోమని ఎస్సై హెచ్చరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

లోకేశ్వరం: రైతులు ఆయిల్‌పాంలో సస్యరక్షణ చర్యలు చేట్టాలని ఆయిల్ పాం భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ అడేపు శేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో నాటిన ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయిల్‌పాం భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ అడేపు శేఖర్ మాట్లాడుతూ మొక్క నాటిన నాలుగో సంవత్సరంలో పంట చేతికి వస్తుందన్నారు. అప్పటివరకు పూత, గెలలను తొలగించాలని కోరారు. వారి వెంట మండల ఆయిల్‌పాం క్లస్టర్ అధికారి సంతోష్, రైతులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కోడిపిల్లలు పంపిణీ

ముధోల్: మహిళా సాధికారత పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు కోడిపిల్లలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గురుచరణ్, ఐకేపీ సీఏలు తదితరులు పాల్గొన్నారు.

యువకునికి సన్మానం

ముధోల్: మండల కేంద్రంలోని కోట గల్లీకి చెందిన యాసిన్ ఖాన్‌ను మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయికిరణ్ సన్మానించారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్ సాయినాథ్ ఖజానా చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా.. యాసిన్ గమనించి అతడు కాపాడారు. యువకుడిని కాపాడినందుకు ఎస్సై యాసిన్ పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో సత్కరించారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

నిర్మల్‌టౌన్: ఇటీవల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అర్జుమండ్ అలీని మంగళవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేశ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నెల్ల అరుణ్‌కుమార్, తమ్మల రాజేశ్, సుధీర్, కరణ్‌సింగ్ ఉన్నారు.

అబుల్‌కలాం సేవలు మరువలేనివి

నిర్మల్: దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అందించిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కలాంగుణాం సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆజాద్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అబుల్‌కలాం, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో అబుల్‌కలాం క్లాక్ టవర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఇందులో రచయిత బొందిడి పురుషోత్తం, సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ అలీ, కోశాధికారి షేక్‌షాదుల్లా హుస్సేన్, అబ్దుల్ ఖదీర్, శేఖ్ మౌలానా ఇబ్రహీం, మసూద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

ఖానాపూర్: గ్రామాల్లోని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మంగళవారం డ్రైడేలో భాగంగా మండలంలోని తర్లపాడ్, దిలావర్‌పూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

- జెడ్పీ సీఈవో గోవింద్

లక్ష్మణచాంద: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పీ సీఈవో గోవింద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలకేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనం, కిచెన్‌లో కూరగాయలు, సరుకులను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని.. అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, ఎస్‌వో నవిత తదితరులు ఉన్నారు.



భోజనం పరిశీలిస్తున్న సీఈవో గోవింద్

కొనసాగుతున్న శత చండీయాగం

భైంసా: పట్టణంలోని అన్నపూర్ణ క్షేత్రంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శత చండీయాగం కొనసాగుతుంది. రెండోరోజు కలశ పూజలు చేసి హోమం కొనసాగించారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. హోమం అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు చేశారు. దంపతులతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. బుధవారం సప్తశతచండీయాగం ముగింపు ఉంటుందని ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ తెలిపారు.



హోమంలో దంపతులు

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న గంగాయిపేట్ గ్రామంలోని మేనత్త ఇంటికి బయలుదేరిన పాతతర్లపాడ్ గ్రామానికి చెందిన పూసమ్ శ్రీరామ్ అనే బాలుడు దారి తప్పి సుభాశ్‌నగర్, మదీనా కాలనీల్లోకి వెళ్లాడు. దీంతో సోమవారం రాత్రి ఏడుస్తూ కనిపించిన బాలుడిని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసు సిబ్బంది సంతోష్, రవీందర్, రవి, ఫణీంద్ర అక్కడకు వచ్చి బాలుడిని తీసుకెళ్లి అతడి తండ్రి రాముకు అప్పగించారు. సిబ్బందిని సీఐ సైదారావు, ఎస్సై రాహుల్ అభినందించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రైతు విగ్రహావిష్కరణకు రావాలి

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే రైతు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామాల్లోని మున్నూరుకాపులంతా తరలిరావాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని గోసంపల్లె, నడింపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి ఆ సంఘ సభ్యులకు ఆహ్వానపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, మడిగెల గంగాధర్, సిరిపురం నాగరాజు, అడిదెల రాజన్న, నిమ్మల రమేశ్, కొక్కుల ప్రదీప్, గోడపురం సందీప్, జగడం గాంధీ, కొప్పుల రాజేశ్వర్, గోండ నర్సయ్య, కొడిమెల మల్లయ్య, కొక్కుల శేఖర్, వేల్పుల లక్ష్మిరాజం, ఎడ్ల శంకర్, గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో పోలీసులకు ఫిర్యాదు చేయండి

నిర్మల్‌టౌన్: ఆపద వస్తే ఆందోళన చెందకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని భరోసా సెంటర్ ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల విద్యార్థులకు భరోసా సెంటర్, షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్‌ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో షీటీం, భరోసా సెంటర్ పోలీసులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బస్‌పాసులు పంపిణీ

సారంగాపూర్: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న బస్‌పాస్‌లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్మల్ విలేజ్ బస్ అధికారి టీవీ రమణ, నిర్మల్ బస్టాండ్ మేనేజర్ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి స్వర్ణ పంచాయతీ కార్యాలయంలో గ్రామానికే చెందిన దివ్యాంగులకు 49 బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఈ పాసులతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో 50శాతం రాయితీపై ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

నిజామాబాద్‌లో జిల్లావాసి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన
- మృతుడి స్వస్థలం ఖానాపూర్ మండలం సుర్జాపూర్

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల్ జిల్లావాసి వైద్యుల నిర్లక్ష్యంతో గుండెపోటుతో మరణించాడని మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామానికి చెందిన మహేందర్ (40) ఆదివారం సాయంత్రం నిజామాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చేరారు. మహేందర్‌కు అన్ని పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. గుండెపోటు రాలేదని నిర్ధారించారు. సోమవారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన మహేందర్ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందారు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొనగా.. కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. టౌన్ సీఐ శ్రీనివాసరాజు, ఎస్సైలు యాసీన్ ఆరాఫత్, శ్రీకాంత్ మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.



మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ శ్రీనివాసరాజు

ప్రొసీడింగ్ కాపీల అందజేత

భైంసారూరల్: ముధోల్ మండలం తరోడాలో షాదీఖానా నిర్మాణానికి రూ.5లక్షలు, కబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీలను దేగాంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. సురేందర్‌రెడ్డి, మొయినొద్దీన్, యూనిస్‌ఖాన్, ఖలీముల్లాఖాన్, తదితరులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కడెం: మండలంలోని పెత్తర్పు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు మంగళవారం మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న గురుకుల ప్రవేశపరీక్షకు అవసరమైన రూ.4500 విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. హెచ్‌ఎం గంగారాం, ఉపాధ్యాయుడు అల్లాడి స్వామి, పోషకులు తదితరులు ఉన్నారు.